క్లుప్తంగా

ఆర్టీసీ ఆదాయం ఆశాజనకం



మాచర్ల: మాచర్ల ఆర్టీసీ డిపో పరిధిలో సాగర్ మాత, మహాశివరాత్రి ప్రత్యేక బస్సుల ఏర్పాటు కారణంగా అత్యధిక ఆదాయం సంపాదించినట్లు డీఎం ఆర్.పిచ్చయ్య సోమవారం తెలిపారు. భక్తుల సౌకర్యార్థం ఈ నెల 7, 8, 9 తేదీలలో మహాశివరాత్రి, సాగర్ మాత దేవాలయం, సత్రశాల, శ్రీశైలం, దైదకు ప్రత్యేక బస్సులు నడపటం వలన మొత్తం రూ.9,18,681 ఆదాయం వచ్చినట్లు చెప్పారు. ఈ ఏడాది మహాశివరాత్రి సందర్భంగా 10,132 కి.మీ.లకు రూ.5,99,505, సాగర్ మాత దేవాలయానికి 5,932 కి.మీ.లకు రూ.3,19,176 ఆదాయం లభించినట్లు తెలిపారు. మొత్తంగా భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా విజయవంతంగా సహకరించిన కండక్టర్లు, డ్రైవర్లు, సిబ్బందికి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

నాగిరెడ్డికి నివాళి



దాచేపల్లి : మాజీ ఎమ్మెల్యే మందపాటి నాగిరెడ్డి 19వ వర్ధంతి వేడుకలు సోమవారం నిర్వహించారు. నడికుడి విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఉన్న నాగిరెడ్డి స్మారక స్థూపం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాగిరెడ్డి చేసిన సేవలు నేతలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో నేతలు షేక్ హుస్సేన్, మందపాటి రమణారెడ్డి, బుర్రి కృష్ణారెడ్డి, తెలనాకుల సత్యనారాయణ, కొలా స్వాతి, కాంగ్రెస్ నేత ప్యూజన్ తదితరులు పాల్గొన్నారు.

ఫోర్టిఫైడ్ బియ్యంలో ఎన్నో పోషకాలు

రాష్ట్ర పౌరసరఫరాల శాఖ డైరెక్టర్ కర్రా ప్రగతి

గురజాల : ప్రభుత్వం అందించే ఫోర్టిఫైడ్ బియ్యంలో మంచి పోషకాలు ఉన్నాయని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ డైరెక్టర్ కర్రా ప్రగతి అన్నారు. ఆమె తన కార్యాలయంలో మాట్లాడుతూ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ వారు కూడా ఫోర్టిఫైడ్ బియ్యంలో మంచి పోషకాలు ఉన్నాయని ఆమోదించడం జరిగిందన్నారు. బియ్యంలో విటమిన్ ఏ, బీ6, థయామిన్, రైబోఫ్లావిన్, నియాసిస్ వంటి పోషకాలు కలపడం జరిగిందన్నారు. ఈ బియ్యం వలన మహిళల్లో రక్తహీనత ఉండదన్నారు. చిన్నారుల్లో రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు.

చిరుధాన్యాలపై అవగాహన



విజయపురిసౌత్: పోషణ్ పక్వాడా పక్షోత్సవాలను పురస్కరించుకొని మాచర్ల మండలం చింతలతండా గ్రామంలోని అంగన్‌వాడీ–2 కేంద్రంలో సూపర్‌వైజర్ లీలావతి సోమవారం చిరుధాన్యాలపై అవగాహన కల్పించారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు లభించే జొన్న, సజ్జ, కొర్ర, మినుము, అలసందలను ఆహారంలో ఉపయోగించే విధానాన్ని వివరించారు. చిరుధాన్యాలలో ఫైబర్, కాల్షియం ఎక్కువగా ఉండటం వలన పిల్లల ఎదుగుదలకు, ఎముకల పటుత్వానికి ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌కే సుజాత, చింతలతండా అంగన్‌వాడీ కార్యకర్తలు జీవీ మహాలక్ష్మి, శారద, రూప, అఖిల, అంగన్‌వాడీ కేంద్రాల పిల్లల తల్లులు పాల్గొన్నారు.

తుమ్మకోట(రెంటచింతల): చిరుధాన్యాలు ఎన్నో రకాల పోషకాలకు నిలయాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఎ.నాగమణి అన్నారు. సోమవారం పోషణ్ పక్వాడా పక్షోత్సవాలలో భాగంగా మండలంలోని తుమ్మకోట గ్రామ పురవీధులలో అంగన్‌వాడీ, ఆరోగ్య, ఆశా కార్యకర్తలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం గ్రామంలోని గర్భిణులు, బాలింతలకు చిరుధాన్యాలు తీసుకోవడం వలన కలిగే ప్రయోజనాలను, వాటి వల్ల లభ్యమయ్యే విటమిన్స్, మినరల్స్‌తో పాటు శరీరానికి అవసరమయ్యే ఖనిజ సంపదలు ఏఏ చిరుధాన్యాలలో ఎంత మోతాదులో లభ్యమవుతాయో అవగాహన కల్పించారు. చిరుధాన్యాలను ఎలా తీసుకోవాలో అనే విషయాలను వివరించి విటమిన్స్, మినరల్స్ లోపం వలన కలిగే అనర్థాలను, వాటి వలన వచ్చే రోగాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు వరికపూడిశెల నిర్మాణ పనుల పరిశీలన

వెల్దుర్తి: పల్నాటి ప్రజల చిరకాలవాంఛ అయిన వరికపూడిశెల ఎత్తిపోతల నిర్మాణ పథకం పనులను మంగళవారం జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, నరసరావుపేట పార్లమెంట్ సమన్వయకర్త అనిల్‌కుమార్ యాదవ్, పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, వినుకొండ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన ఉపాధ్యక్షుడు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డిలు పరిశీలించనున్నట్లు ఎంపీపీ అలుగుమల్లి సంజీవరెడ్డి సోమవారం తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ స్థాయి రైతులు, వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలన్నారు.

ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటాం

షాదీఖానా, కమ్యూనిటీ హాల్ ప్రారంభంలో ఎమ్మెల్యే కాసు



ఇంటి స్థలం రిజిస్ట్రేషన్ పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి



బేడ బుడగ జంగం కాలనీలో కమ్యూనిటీ హాల్ ప్రారంభించిన ఎమ్మెల్యే కాసు

గురజాల : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటారని ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి అన్నారు. నగర పంచాయతీలోని బేడ బుడగ జంగం కాలనీలో రూ.22 లక్షల నిధులతో నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను, ముస్లిం మైనార్టీల షాదీఖానాను సోమవారం సాయంత్రం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ పాలన అందిస్తున్నామన్నారు. గతంతో పోల్చితే గురజాల రూపురేఖలు పూర్తిగా మారిపోయాయన్నారు. త్వరలో షాదీఖానాకు ఏసీ ఏర్పాటు చేస్తామన్నారు. అభివృద్ధి ఇంతటితో ఆగదని ముందుకు సాగుతుందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా పాలన అందిస్తున్నామన్నారు. అర్హులు ఉంటే సంబంధిత సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. బేడ బుడగ జంగం కాలనీ వాసుల కుల ధ్రువీకరణ సమస్యను త్వరలో పరిష్కరించే విధంగా చర్యలు చేపడుతున్నామన్నారు. ఢిల్లీ పెద్దల మెడలు వంచైనా సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. రానున్న ఎన్నికల్లో కూడా వైఎస్సార్‌సీపీని అఖండ మెజార్టీతో గెలిపించి ఎంపీగా అనిల్‌కుమార్ యాదవ్‌కు, ఎమ్మెల్యేగా నన్ను ఆశీర్వదించాలన్నారు. ప్రతి ఒక్క ఇంటికి సుమారు రూ.5 లక్షలకు పైగా నేరుగా వారికి ఖాతాల్లో సంక్షేమం ద్వారా అందుతుందన్నారు. అనంతరం పలువురు మహిళలకు ఇంటి స్థలాలు రిజిస్ట్రేషన్ పత్రాలను అందించారు.

ఢిల్లీ పెద్దల కాళ్లు పట్టుకున్న చంద్రబాబు..

ఢిల్లీ పెద్దల కాళ్లు పట్టుకుని చంద్రబాబు నాయుడు వారి పొత్తు కోసం ఆరాటపడుతున్నాడని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. నగర పంచాయతీలో కమ్యూనిటీ హాల్, షాదీఖానా ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు ఇద్దరూ ఢిల్లీ పెద్దల ముందు మోకరిల్లుతున్నారన్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే వెంటనే ముస్లింలకు కల్పించిన 4% రిజర్వేషన్ తొలగిస్తామని బహిరంగంగానే అమిత్ షా చెప్పారని గుర్తు చేశారు. మోదీ అధికారంలోకి వస్తే ముస్లింల ఓట్లు తొలగించడం జరుగుతుందని మోదీకి ఓట్లు వేయవద్దని గతంలో విమర్శించిన చంద్రబాబు ఇప్పుడు మోదీ కాళ్ల వద్దకు వెళ్లాడన్నారు. దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తీసుకువచ్చిన 4% రిజర్వేషన్, ఫీజు రియింబర్స్‌మెంట్ ద్వారా ఎంతో మంది ముస్లింల పిల్లలు ఉన్నత చదవులు చదువుకున్నారని గుర్తు చేశారు. చంద్రబాబు ఎంత మందితో జతకట్టినా ఏమి చేయలేరని మా ముస్లిం మైనార్టీల జోలికి వస్తే సహించేది లేదన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీనే గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి యెనుముల మురళీధర్‌రెడ్డి, సీనియర్ నాయకుడు కొమ్మినేని వెంకటేశ్వర్లు, నగర పంచాయతీ వైస్ చైర్మన్ షేక్ బడేజానీ, జెడ్పీటీసీ ఆరికట్ల శ్రీనివాసరెడ్డి, కౌన్సిలర్ పోలు వీరారెడ్డి, మండల కన్వీనర్ సిద్దాడపు గాంధీ, పట్టణ కన్వీనర్ అన్నారావు, పార్టీ రాష్ట్ర సేవాదళ్ ప్రధాన కార్యదర్శి కర్రా చిన్న కోటేశ్వరరావు, మార్కెట్ యార్డు చైర్మన్ కె.అంద్రెయ్య, కో ఆప్షన్ మెంబర్ షేక్ పీర్ అహ్మద్, కె.బుజ్జి, వి.చలమయ్య, మన్నెం ప్రసాద్, షేక్ నాగులు మీరా, మీర్వా, వలి, గందం చిన్నా, జి.చంద్రయ్య, అంజి, సైదులు, కె.గిరిబాబు, ముస్లిం మైనార్టీ జిల్లా నాయకుడు ఎండీ గఫార్, నాగులుమేస్త్రీ, మీర్వా, కో ఆప్షన్ మెంబర్ షేక్ పీర్ అహ్మద్, వలి, ముస్లిం మైనార్టీ నాయకులు తదితరులున్నారు.

పేదల పక్షపాతి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి



రిజిస్ట్రేషన్ పత్రాలను అందిస్తున్న నాయకులు

గురజాల : పేదల పక్షపాతి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కౌన్సిలర్ పోలు వీరారెడ్డి అన్నారు. నగర పంచాయతీ పరిధిలోని 1, 2, 3, 4 సచివాలయాల పరిధిలో సోమవారం జగనన్న లే అవుట్ ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ పూర్తి చేసి పత్రాలను లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకే విడతలో ఇంతమందికి ఇంటి స్థలాలు అందించడం ఇదే ప్రథమమన్నారు. గతంలో ఏ ప్రభుత్వం ఈ విధంగా పట్టాలు అందించిన దాఖలాలు లేవన్నారు. ప్రతి ఒక్కరికీ అర్హతను బట్టీ సంక్షేమ పథకాలు అందించడంతో ప్రజలు ఆనందంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ షేక్ బడేజానీ, కౌన్సిలర్‌లు కుక్కమూడి అనిల్‌కుమార్, పార్టీ నాయకుడు కర్రా గిరిబాబు, మన్నెం ప్రసాద్, చిట్టిమాల ప్రసాద్, చల్లా కాశీబాబు, మహంకాళి యశోదదుర్గ తదితరులున్నారు.

శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులకు సహకరించాలి



ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న రూరల్ సీఐ సురేష్, ఎస్ఐ రాజశేఖర్, స్పెషల్ పోలీసులు

మాచర్ల రూరల్: రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రజలు శాంతియుతంగా తమ ఓటు హక్కు వినియోగించుకొని ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించటంలో పోలీసులు ఎప్పుడూ ముందుంటారని రూరల్ సీఐ కె.సురేష్ తెలిపారు. సోమవారం మండలంలోని రాయవరం, కంభంపాడు గ్రామాలలో పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించి ప్రజలతో మాట్లాడారు. శాంతియుతంగా ఎన్నికల నిర్వహణకు పోలీసులు శాంతిభద్రతలు పరిరక్షించటంలో ప్రజలకు అందుబాటులో ఉంటారని, గ్రామాలలో ఎవరైనా గ్రూపులు కట్టి, దౌర్జన్యాలకు, ఇతర అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే వారు ఎంతటి వారైనా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు పోలీసులకు తమ సహకారాన్ని అందించి ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు తోడ్పడాలన్నారు. ఈ ఫ్లాగ్ మార్చ్‌లో రూరల్ ఎస్ఐ రాజశేఖర్, స్పెషల్ పోలీసులు పాల్గొన్నారు.

నేడు దుర్గి మార్కెట్ యార్డు పాలకవర్గం ప్రమాణ స్వీకారం

దుర్గి: పల్నాటి ప్రాంతంలో ప్రసిద్ధిగాంచిన దుర్గి మార్కెట్ యార్డు పాలక వర్గం ప్రమాణ స్వీకారం మంగళవారం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి కొమ్ము చంద్రశేఖర్ సోమవారం తెలిపారు. సాయంత్రం 5 గంటలకు స్థానిక మార్కెట్ యార్డులో జరగనున్న ప్రమాణస్వీకార కార్యక్రమానికి పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ నరసరావుపేట పార్లమెంట్ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్, బాపట్ల ఎంపీ నందిగం సురేష్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన ఉపాధ్యక్షుడు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డిలు హాజరుకానున్నట్లు తెలిపారు. చైర్మన్‌గా కొమ్ము కౌసల్య, వైస్ చైర్మన్‌గా గురజాల రామారావు, పాలకవర్గ సభ్యులు బాధ్యతలు చేపట్టనున్నారు. ప్రజా ప్రతినిధులు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

సమాజానికి ఆదర్శమూర్తి సావిత్రి బాయి పూలే

ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



సావిత్రి బాయి పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

పిడుగురాళ్ల: సమాజానికి ఆదర్శమూర్తి సావిత్రి బాయి పూలే అని స్థానిక ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ఆర్ అండ్ బీ బంగ్లా సెంటర్‌లో ఉన్న జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద సావిత్రి బాయి పూలే వర్ధంతి సందర్భంగా సోమవారం నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భర్త ఆశయాలను సాధించేందుకు తాను విద్య నేర్చుకొని ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహించి నిరక్షరాస్యులకు అక్షరాలు నేర్పిన మహా వనిత సావిత్రి బాయి పూలే అన్నారు. అంటరాని తనాన్ని తరిమేందుకు కృషి చేసి, అందరు సమానమే అని చాటిచెప్పి చరిత్రలో నిలిచారని పేర్కొన్నారు. అందరు విద్యావంతులైతేనే సమాజంలో అసమానతలు తొలగుతాయన్న సంకల్పంతో విద్యాభివృద్ధిని సాధించి పలువురికి ఆదర్శంగా ఉన్నారని అన్నారు. అనంతరం బీసీ నాయకులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో బీసీ కమిషన్ సభ్యులు కుందుర్తి గురవాచారి, బీసీ నాయకులు మార్కెట్ యార్డు చైర్మన్ కొమెర వెంకటేశ్వర్లు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు భవనాశి ఎల్లారావు, గొట్టిముక్కల పవన్‌రెడ్డి, పట్టణ బీసీ సెల్ కన్వీనర్ కందులూరి శివయ్య, దాదినబోయిన ఏడుకొండలు గౌడ్, పోచిమళ్ల కొండలు, ప్రముఖ న్యాయవాది కంభంపాటి కోటేశ్వరరావు, ఇల్లూరి వెంకయ్య, రాము, జంగా ఏసయ్య, నెమలికంటి సైదులు, పలువురు బీసీ నాయకులు పాల్గొన్నారు.

అంకితభావంతో విధులు నిర్వర్తించాలి



రెంటచింతల: గ్రామీణ ప్రాంతాలలోని ప్రజలకు క్షేత్రస్థాయిలోనే మెరుగైన సేవలు అందించేందుకు కార్యదర్శులు, సచివాలయాలలో పనిచేస్తున్న ఉద్యోగులు అంకితభావంతో విధులు నిర్వర్తించాలని ఎంపీడీవో పెదప్రోలు శంకర్‌రావు అన్నారు. సోమవారం స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో కార్యదర్శులకు, సచివాలయ ఉద్యోగులకు ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో పలు సూచనలు చేసి మాట్లాడారు. ఉద్యోగులు కచ్చితంగా సమయపాలన పాటించాలన్నారు. గ్రామాలలో ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ప్రజల పట్ల అనుచింతగా వ్యవహరించినా... వారిని ఇబ్బంది పెట్టినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఆరోగ్యశ్రీ కార్డులు, ప్రధాన మంత్రి జన ఆరోగ్య యోజన కార్డులను (పీఎంజేఏవై), ఎన్ని పంపిణీ చేయడం జరిగిందని తెలుసుకున్నారు. ఎంఎస్‌ఎంఈ సర్వే వివరాలను, ఎన్‌పీఐ రిజిస్ట్రేషన్లు ఎప్పటికప్పుడు కార్యదర్శులు, వెల్ఫేర్ ఎడ్యుకేషనల్ అసిస్టెంట్లు సమీక్షించాలన్నారు. ఆరోగ్యశ్రీ, పీఎంజేఏవై కార్డులను లబ్ధిదారులకు ఇవ్వకుండా కాలయాపన చేస్తున్న వలంటీర్ల వివరాలను సేకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పాముల సంపూర్ణమ్మ, ఈవోపీఆర్డీ జి.అనంత కోటేశ్వరరావు, కార్యదర్శులు వెంకయ్య, సుబ్బారావు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఇంటి పట్టాలు

మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము ముక్కంటి



ఇంటి పట్టాలు చూపుతున్న మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము ముక్కంటి, కౌన్సిలర్లు

పిడుగురాళ్ల: అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఇంటి పట్టాలు అందించడం జరిగిందని మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము ముక్కంటి అన్నారు. పట్టణంలోని బాబు జగజ్జీవన్‌రామ్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం వైఎస్సార్‌సీపీ 6వ వార్డు కౌన్సిలర్ పసుపులేటి ఆనందబాబు ఆధ్వర్యంలో ఇంటి పట్టాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము ముక్కంటి హాజరై మాట్లాడుతూ ముఖ్యమంత్రి రాష్ట్రంలోని ప్రతి పేదవాడికి పక్కాగా ఇల్లు ఉండాలన్న సంకల్పంతో ప్రతి ప్రాంతంలో సర్వే నిర్వహించి అర్హత ఉన్న వారికి పట్టాలు అందించడం జరుగుతుందని, అందులో భాగంగా పట్టణంలో స్థానిక ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ఆదేశాలతో ఇంటి పట్టాల పంపిణీ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని తెలిపారు. అనంతరం సుమారు 80 మంది పేద మహిళలకు ఇంటి స్థల పట్టాలను అందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు కత్తెరపు వాసుదేవరెడ్డి, పసుపులేటి ఆనంద్‌బాబు, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ యవజన నాయకులు గొట్టిముక్కల పవన్‌రెడ్డి, పట్టణ యూత్ కన్వీనర్ మందా సుధీర్, వార్డు ఇన్‌చార్జి పసుపులేటి అనిల్ కుమార్, మహిళలు, నాయకులు, కార్యకర్తల పాల్గొన్నారు.

వైభవంగా వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం




విజయపురిసౌత్: పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణ మహోత్సవం ఆలయ ధర్మకర్త ఆడెపు బ్రహ్మం, ఆడెపు కోటయ్య ఆధ్వర్యంలో సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు వడ్లమాను సుబ్రహ్మణ్యాచారి ఆధ్వర్యంలో ఉదయం నుంచే స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం 2 వేల మంది భక్తులకు అన్నదానం కార్యక్రమం చేపట్టారు. సాయంత్రం స్వామి వారి ఊరేగింపు భక్తుల కోలాటం నడుమ వైభవంగా జరిగింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య సేవలు



పిడుగురాళ్ల: పట్టణంలోని మెప్మా కార్యాలయం సమీపంలో ఉన్న పట్టణ ఆరోగ్య కేంద్రం వద్ద సోమవారం ఉచిత వైద్య సేవలు నిర్వహించారు. మెప్మా, న్యూలైఫ్ వలంటరీ ఆర్గనైజేషన్‌ల ఆధ్వర్యంలో ఉచిత వైద్య సేవలు నిర్వహించారు. సుమారు 120 మందికి వైద్య సేవలు అందించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం పట్టణంలోని నిరాశ్రయులకు ఏర్పాటు చేసిన బస కేంద్రంలో వాటర్ కూలర్‌ను ఏర్పాటు చేసి వైద్యుల చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ అనిల్ కుమార్, మెప్మా సీఎంఎం శ్రీనివాసరావు, సీవోలు శ్రీనివాసరావు, బాలు, న్యూలైఫ్ వలంటరీ ఆర్గనైజేషన్ ప్రెసిడెంట్ సీహెచ్ రాజేంద్ర పాసద్, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



వెల్దుర్తి: మండలంలోని మూరుమూల ప్రాంతంలో ఉన్న సేవానాయక్ తండాలో శిరిగిరిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ థెరిస్సా ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం సోమవారం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో 22 మంది నుంచి రక్త నమూనాలు సేకరించారు. ఈ తండాలో వారికి జ్వరం, కీళ్ల నొప్పులు వస్తుండటంతో సర్పంచ్ రమావత్ పద్మాబాయి వైద్యుల దృష్టికి తీసుకెళ్లి వైద్య శిబిరాన్ని నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నారు. రోగులకు ఉచితంగా మందులను పంపిణీ చేశారు. రక్త నమూనాల పరిశీలన అనంతరం వారికి మందులను అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో రమావత్ బాలునాయక్, వైద్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉండాలి



అధికారులతో మాట్లాడుతున్న తహసీల్దార్ గీతారాణి

దాచేపల్లి : ఎన్నికలకు అధికారులు సిద్ధంగా ఉండాలని తహసీల్దార్ గీతారాణి అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల నిర్వహణపై అన్ని శాఖల అధికారులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఎన్నికల నిర్వహణపై ఈసీ సూచించిన పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికలను సమర్థంగా నిర్వహించాలని, ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పక్కా ప్రణాళికతో ఎన్నికలు పూర్తి చేయాలని చెప్పారు. సమస్యాత్మక గ్రామాల్లో పటిష్టమైన భద్రతను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని పోలీసులకు సూచించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. ఈ సమావేశంలో ఎస్ఐ దాసరి శివనాగరాజు, ఈవోపీఆర్డీ జోసఫ్‌రాజు, ఎంఈవో పినాకపాణి, ఏవో పాపకుమారి, ఏఈలు శ్రీనివాసనాయక్, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

భద్రత ప్రమాణాలు పాటించాలి



కార్మికులతో కలిసి ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

దాచేపల్లి : ప్రతి కార్మికుడు భద్రత ప్రమాణాలు పాటించాలని ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ జిల్లా అధికారి కె.రాంబాబు అన్నారు. మండలంలోని గామాలపాడు గ్రామ పంచాయతీ పరిధిలోని ఆంధ్రా సిమెంట్స్ ఫ్యాక్టరీలో 53వ జాతీయ భద్రత వారోత్సవాలు సోమవారం ముగిశాయి. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన రాంబాబు భద్రత పతాకాన్ని ఆవిష్కరించి కార్మికులతో ప్రతిజ్ఞ చేయించారు. ఫ్యాక్టరీలో పనిచేసే ప్రతి కార్మికుడు, ఉద్యోగి తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, భద్రత లేకుండా పనిచేయటం, ప్రయాణాలు చేయటం ప్రమాదకరమని చెప్పారు. కుటుంబం నుంచే భద్రత నియమాలను మనమంతా తెలుసుకోవాలని సూచించారు. సురక్షితమైన వాతావరణం ఉన్న చోట పనిచేయగలమని, అటువంటి వాతావరణాన్ని మనమే సృష్టించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ సీహెచ్ సుబ్బారావు, ఫ్యాక్టరీ అధికారులు సుబ్బారెడ్డి, నవీన్‌రెడ్డి, నాగభూషణం, అంబేడ్కర్‌రెడ్డి, వీరప్రకాష్, నరసింహ, సీహెచ్ రామకృష్ణ, అశోక్, భద్రత అధికారి సంజయ్‌కుమార్ సింగ్, సంక్షేమ అధికారి నరసింహ పాల్గొన్నారు.

ఎంఆర్‌పీఎస్ సదస్సును జయప్రదం చేయండి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు పేరుపోగు రామయ్య

దుర్గి: మాదిగ ఇతర ఉప కులాల సదస్సును ఈ నెల 14న గురువారం నరసరావుపేటలోని షాదీఖానాలో నిర్వహిస్తున్నట్లు పల్నాడు జిల్లా ఎంఆర్‌పీఎస్ అధ్యక్షుడు పేరుపోగు రామయ్య సోమవారం తెలిపారు. మాదిగల చిరకాలవాంఛ అయిన ఏబీసీల వర్గీకరణ, ఇతర సమస్యలపై సదస్సు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా మాదిగ సోదరులు హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. అనంతరం స్థానిక ఏఈఎల్‌సీ చర్చిలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో దుర్గి మండల ఎంఆర్‌పీఎస్ అధ్యక్షులు పేరుపోగు సాగర్, బి.శాంతి ప్రసాద్, కనకరాజు వెంకయ్య, పొన్నూరు ఆదెయ్య, మిరియాల ప్రసాద్, టి.వీరయ్య, డి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

• నేడు షాదీఖానా, హెల్త్ క్లినిక్ ప్రారంభం

రెంటచింతల: మండలంలోని తుమ్మకోట గ్రామంలో నిర్మించిన షాదీఖానా, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ మంగళవారం ప్రభుత్వ విప్, పల్నాడు జిల్లా అధ్యక్షులు, మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేయనున్నట్లు పీఆర్‌డీఈ పాశం శ్రీనివాసరెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక పీఆర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. సాయంత్రం 5 గంటలకు ఈ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు.

• రేపు గాంధీ కాంస్య విగ్రహం ప్రారంభం

పిడుగురాళ్ల: పట్టణంలోని ఆర్ అండ్ బీ బంగ్లా సెంటర్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన జాతిపిత మహాత్మాగాంధీ కాంస్య విగ్రహం ఈ నెల 13వ తేదీన ప్రారంభించనున్నట్లు విగ్రహ కమిటీ సభ్యులు సోమవారం తెలిపారు. ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి హాజరై ప్రారంభించనున్నారని చెప్పారు.